క్లుప్తంగా

పత్రికా స్వేచ్ఛ కోసం పోరాటం



నివాళులర్పిస్తున్న నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామిక విలువలు కోసం పోరాడిన జర్నలిస్టు షోయాబుల్లాఖాన్ అని ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్‌బాషా అన్నారు. నగరంలోని ఆప్ కీ ఆవాజ్ కార్యాలయంలో షోయబుల్లాఖాన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ నిజాం వ్యతిరేక ప్రజా పోరాటాలను బలపర్చినందుకు రజాకార్ల చేతిలో షోయబుల్లాఖాన్ హత్యకు గురయ్యారని అన్నారు. హైదరాబాద్‌లో బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పడాలంటూ ధైర్యంగా వార్తలు రాసిన ఘనుడు అన్నారు. ఇప్పుడు అంతకంటే పెద్ద ప్రమాదాన్ని మీడియా ఎదుర్కొంటోందన్నారు. మౌలాలి ఇర్ఫాన్, గౌస్ సయ్యద్, అజ్మతుల్లా, మస్తాన్, మహబూబ్ బాషా, సమీర్‌బాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



సమస్యలను తెలుసుకుంటున్న నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రజల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ సయ్యద్‌గౌస్‌పీర్ అన్నారు. నగరంలోని 27వ డివిజన్ గౌస్‌నగర్ పరిధిలో శుక్రవారం ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ పోరాడుతున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందాలంటే దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ షామీర్ హుస్సేన్, కమాల్ బాషా, ముబారక్, యూసఫ్, ఫజలుల్లా, కరిముల్లా, నీలం, సిరాజ్, కరీం, సిద్దిక్, తదితరులు పాల్గొన్నారు.

సహాయకులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న సేవామూర్తులు

కడప అర్బన్: హైదరాబాద్ నగర వాస్తవ్యులు దివంగత డాక్టర్ అవ్వారు శివశంకరయ్య సతీమణి అవ్వారు జయశ్రీ జ్ఞాపకార్థం వారి కుమారుడు గురు కుమార్ కుమార్తె షర్లి, వారి కుటుంబ సభ్యులు హిమ వర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడప రిమ్స్ ఆవరణలో రోగుల సహాయకులకు శుక్రవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గుండ్లకొండ విజయలక్ష్మి, గుండ్లకొండ రవి, పురుషోత్తం, రెడ్డి లక్ష్మణ్, వెంకట సురేష్‌బాబు, దామోదర్, మునిజ, టైలర్ రవి, దుర్గ బాబు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీ...నీరు వృథా



కడప–మద్రాసు రోడ్డులోని రామక్రిష్ణ నగర్ సుజుకీ షోరూం ఎదురుగా ప్రధాన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో తాగునీరు వృథాగా ప్రవహిస్తోంది. గతంలో పైపులైన్ పగిలిపోతే మరమ్మతుచేసి సిమెంట్, కాంక్రీట్‌తో పూడ్చివేశారు. ఇప్పుడు మళ్లీ అదే చోట లీకేజీ ఏర్పడింది. – కడప కార్పొరేషన్

అవగాహన పెంచుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది

కడప అగ్రికల్చర్: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డీసీసీ బ్యాంకు సీఈఓ రాజామణి, జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య అన్నారు. రాష్ట్ర సమాచార కమిషనర్ ఆదేశాల మేరకు డీసీసీబీ, డీసీఓ, డీసీఎంఎస్, సహకార సంఘాల సిబ్బంది డీసీఎంఎస్ నుంచి కోటిరెడ్డి సర్కిల్ మీదుగా డీసీసీ బ్యాంకు వరకు శుక్రవారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాచార హక్కు(ఆర్‌టిఐ యాక్ట్ 2005) ద్వారా ప్రతి సమాచారం తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్విజ్ పోటీలు

కడప రూరల్: జిల్లా స్థాయి క్విజ్ పోటీలను శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. కడప నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పోటీలు ఉంటాయని, మండల, డివిజనల్ స్థాయిలో విజేతలైన విద్యార్థులు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హెచ్ఐవీ, ఎయిడ్స్ అంశంపై పోటీలు ఉంటాయన్నారు.

రహదారి, ప్రజా రవాణా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరపాలక పరిధిలోని శివారు ప్రాంతాలను కలుపుతూ డ్రైనేజీ వ్యవస్థ, ప్రజా రవాణా వ్యవస్థను ప్రజలకు మరింత సులభతరం చేసేలా ప్రణాళిక రూపొందిస్తామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. కడప ఆర్డీవో సమావేశ మందిరంలో కడప నియోజకస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామాంజనేయపురం సమీపంలోని టిడ్కో గృహ సముదాయాలు, చలమారెడ్డి పల్లె హౌసింగ్ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన అక్టోబర్ 2వ తేదీ నాటికి పూర్తిచేయాలన్నారు. కాలనీల్లో కమ్యూనిటీ పార్కు, కమర్షియల్ కాంప్లెక్స్, ప్లాంటేషన్ వంటి లబ్ధిహుడ్ పనులను పూర్తి చేయాలన్నారు. ఎండోమెంట్, వక్ఫ్, క్రిస్టియన్ మిషనరీ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత అధికారుల చేతుల్లోనే ఉందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులకు అర్హులను గుర్తించాలన్నారు. చౌక దుకాణాల ద్వారా రేషన్ సరుకులు తీసుకునేవారికి సెప్టెంబర్ 15వ తేదీ నుంచి స్మార్ట్ కార్డులు అందిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ కడప పాత బస్టాండులో పార్కింగ్, ఎస్పీడీడీఎల్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు 15 సెంట్ల స్థలం అవసరం అవుతుందని, నగరానికి నూతన 132 కెవి సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వంద శాతం అంగ వైకల్యం ఉన్న వారు లబ్ధి పొందలేకవడానికి కారణాలు ఏమిటని ప్రశ్నించగా జిల్లా వైద్యాధికారులు పునఃపరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. డిప్యూటీ డీఈవో హోదాలో ఒకరిని నియమించేందుకు ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ సూచించారు. బుగ్గవంక ద్వారా ముంపు భద్రత లేకపోయినా, బ్యూటిఫికేషన్ లో భాగంగా లోనింగ్ రోడ్డు పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. ప్రత్యేక మేళా ద్వారా ప్రతి ఒక్కరూ టౌన్ ప్లానింగ్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కేఎంసి కమిషనర్ మనోజ్‌రెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, అధికారులు హాజరయ్యారు.

వైవీయూకు నిధులివ్వాలని విద్యార్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఆర్‌ఎస్‌ఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం అభివృద్ధికి వంద కోట్ల రూపాయలు కేటాయించాలని ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం.ఓబులేసు డిమాండ్ చేశారు. వైవీయూలోని సర్ సీవీ రామన్ సైన్స్ బ్లాక్ వద్ద శుక్రవారం ఆయన విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఓబులేసు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతో నిధుల మంజూరు విషయంలో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీల్లో భవనాలు, మౌలిక వసతులను బట్టి యూజీసీ గుర్తింపు ఇస్తుందన్నారు. 20 ఏళ్లు గడచినా వైవీయూ అభివృద్ధికి నోచుకరోలేదని, వెంటనే మేనేజ్‌మెంట్ బ్లాక్, ప్రధాన పరిపాలనా భవనం, ఆడిటోరియం, ప్రహరీ గోడ నిర్మాణం పూర్తిచేయాలన్నారు. నరసింహులు, విజయ్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

గుండె లోతుల్లోంచి పుట్టుకొచ్చిందే కవిత్వం



కవితల పుస్తకం ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్: తన చుట్టూ ఉన్న సామాజిక స్థితిగతులను చూసి పరవశంతో గుండె లోతుల్లోంచి పుట్టుకొచ్చిన కవిత్వమే లావణ్య రాసిన కమనీయ కవిత ని వైఎస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూలమల్లికార్జున రెడ్డి అన్నారు. కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో లావణ్య రచించిన ‘కమనీయ కవితలు’ కవితా సంపుటిని ఆయన ఆవిష్కరించారు. మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో తన ముందు కదలాడిన అపురూప దృశ్యాలను, ఆనందమయ సన్నివేశాలను, అస్తవ్యస్త సంఘటనలను లావణ్య అద్భుతమైన రీతిలో చిత్రించారన్నారు. షేక్ మహమ్మద్ ఇస్మాయిల్ ప్రసంగిస్తూ సున్నితమైన భావాలను మధురమైన శైలిలో చక్కగా ఆవిష్కరించారని, తనకు కలిగిన ఆలోచనలకు,అనుభూతులకు అక్షర రూపాన్ని ఇచ్చారన్నారు. డాక్టర్ జీవీ.సాయిప్రసాద్ సమీక్షిస్తూ ఏ కవిత్వమైనా సమాజ హితం కావాలని, అసాధారణమైన రీతిలో కవిత్వీకరించి పాఠకుల హృదయాలను చూరగొన్నారన్నారు. డాక్టర్ పుత్తా బాలిరెడ్డి మాట్లాడుతూ లావణ్య గతంలో మానస వీణ మనోగత రాగములు అనే కవిత్వ సంపుటి రాసి ప్రచురించారని తెలిపారు. జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కవిత్వం అంటే క్లిష్టతరంగా ఉండకూడదని, అది సామాన్యులకు అర్థమయ్యే తీరులో ఉండాలని సూచించారు. అనంతరం వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం సభ్యులు లావణ్యను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాయి వంశీకృష్ణ, డాక్టర్ బి. సలీంబాషా, లయన్ కె.చిన్నపరెడ్డి, డాక్టర్ తవ్వా వెంకటయ్య, డాక్టర్ భూతపురి గోపాలకష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ పొదిలి నాగరాజు, డాక్టర్ కొప్పోలురెడ్డిశేఖర్ రెడ్డి, రమేష్, హరిభూషణ్, రామాంజనేయులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక విధానాన్ని ఉపసంహరించుకోవాలని వినతి



ఏడీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్: పరీక్షల నిర్వహణలో కొత్తగా ప్రవేశపెట్టిన మూల్యాంకన పుస్తక విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కడప డీఈఓ కార్యాలయ సహాయ సంచాలకులు అనిల్‌కుమార్‌శర్మను శుక్రవారం ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో విద్యార్థులకు పుస్తకాలు సరఫరా చేయాలనే విధానం కొత్త సమస్యలకు దారితీస్తోందన్నారు. పాఠశాల పని వేళల్లో జరగాల్సిన బోధన సమయాన్ని హరించే విధంగా ఇది ఉందన్నారు. మార్కుల నమోదు కూడా ఉపాధ్యాయులకు పనిభారంగా పరిణమించిందన్నారు. ఆన్‌లైన్ విధానంలో నమోదుకు మాత్రమే పరిమితమై మిగిలిన కార్యక్రమాల నుంచి వెసులుబాటు ఇవ్వాలన్నారు. ఖాదర్‌బాషా, గురయ్య, శ్రీనివాసులు, నరసింహులు, రామచంద్రారెడ్డి, మస్తాన్‌బాబు, సుబ్బారెడ్డి, సలాం, దస్తగిరి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బకాయిలను చెల్లించాలి



మాట్లాడుతున్న రామకృష్ణంరాజు

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలను వెంటనే చెల్లించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏబీ.రామకృష్ణంరాజు కోరారు. కడప జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాలాకాలం నుంచి నేటి వరకూ ఉద్యోగులకు రావాల్సిన అన్ని బకాయిలు లెక్కించి, సమగ్ర సమాచారం రూపొందించాలని కోరారు. ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఒకే యాప్‌లో అనేక సమాచారాలు పెట్టమంటున్నారని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బన్న మాట్లాడుతూ నూతనంగా ప్రవేశపెట్టిన మూల్యాంకన బుక్‌లెట్ అసెస్‌మెంట్ విధానంలో విద్యార్థులకంటే ఉపాధ్యాయులకే ఎక్కువ రాతపని ఉండే విధంగా ఉందన్నారు. ఈ విధానాన్ని రద్దు చేసి ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షల విధానాన్ని పాత పద్ధతిలో నిర్వహించాలని కోరారు. జిల్లా గౌరవాధ్యక్షుడు కూరాకు రవీంద్ర మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి పూర్తిగా మినహాయించాలని కోరారు. అనంతరం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ వైయస్సార్ కడప జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ గఫూర్, ఆదిల్‌బాషా, నారాయణరెడ్డి, చలపతిరాజు, సుబ్బరాయుడు, లక్ష్మినారాయణ, నరసింహారావు, రాజశేఖర్‌బాబు, ఓబులేసు, బాలసుందరం తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం కోట అభివృద్ధి చేయాలి

కడప సెవెన్‌రోడ్స్: సిద్దవటం కోట అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దక్షిణ భారత పర్యాటక సంస్థ గౌరవాధ్యక్షుడు ఎస్.భారవి, అధ్యక్షుడు జ్యోతి జార్జి, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు కోరారు. కడప నగరం ఎర్రముక్కపల్లెలోని ఆ సంస్థ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం వారు మాట్లాడారు. పూర్వం సిద్ధులు వట వృక్షాల కింద తపస్సు చేసినందువల్లే ఈ ప్రాంతానికి సిద్ధవటం అనే పేరు వచ్చిందన్నారు. వందల ఏళ్ల చారిత్రక వైభవం కలిగిన ప్రాంతమని, ఉదయగిరి సామంతరాజులు, మట్లిరాజులు, నవాబులు, ఆంగ్లేయులు ఈ కోట నుంచి పాలన చేశారన్నారు. తొలుత సిద్దవటమే జిల్లా కేంద్రంగా ఉండేదని, పాలకుల నిర్లక్ష్యంతో ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోటలో ఎత్తయిన శివలింగానికి రక్షణ ఏర్పాటుచేయాలని, ముళ్ల పొదలు తొలగించి శుభ్రపరచాలన్నారు. పెన్నా తీరం ఒడ్డున వెలిసిన జ్యోతి సిద్ధవటేశ్వరస్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక ప్రదేశంగా తీర్చిదిద్దాలని కోరారు. జ్యోతిశ్వరస్వామికి రాణి రుద్రమదేవి బహూకరించిన వెండి తేరు, వజ్రాల కిరీటంపై పరిశోధన జరపాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక మారెమ్మ దేవస్థాన కార్యనిర్వాహకులు భాస్కర్, వరప్రసాద్, వనజ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అతివృష్టి, అనావృష్టితో నష్టం

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో అతివృష్టి, అనావృష్టితో వ్యవసాయం తీవ్ర ఒడిదుడుకులకు లోనైందని ఉద్యాన శాఖ మాజీ చైర్మెన్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సరాసరి సాగు 31.15లక్షల హెక్టార్లు అయితే ఈ నెల 20వ తేదీ నాటికి 20.3 లక్షల హెక్టార్లు మాత్రమే సాగయిందన్నారు. రాష్ట్రంలో ఆగష్టు 22వ తేదీ నాటికి కురవాల్సిన సాధారణ వర్షపాతం 375.76 మి.మీ కాగా, కురిసిన సరాసరి వర్షం 35.59 మి.మీ తక్కువగా కురిసిందన్నారు. ఆరు జిల్లాల్లో మైనస్ 20 శాతం కంటే తక్కువ, మిగిలిన జిల్లాలలో సాధారణ వర్షపాతం మైనస్ 19 నుంచి ప్లస్ 19 శాతంగా నమోదైందన్నారు. ఆగస్టు 7వ తేదీ వరకూ అనావృష్టి, 8వతేదీ నుంచి అతివృష్టి మూలంగా రైతులకు మేలు జరగలేదన్నారు. వర్షాభావం వల్ల వేరుశనగ, మినుము, పత్తి, వరి పైర్లు కొన్ని ప్రాంతాల్లో దెబ్బతిన్నాయన్నారు. రాయలసీమలో వేరుశనగ సాదారణ సాగు కంటే చాలా తక్కువ జరిగిందన్నారు. యూరియా నిల్వలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే మళ్లీ రైతులు బారులు తీరాల్సి వస్తుందన్నారు.

అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి బాబా పకృద్దీన్

కడప ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి నుంచే చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి బాబా పకృద్దీన్ సూచించారు. కడప శంకరాపురంలోని అంధుల ఉన్నత పాఠశాలలో దివ్యాంగులు, ప్రత్యేక పిల్లలకు శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల సంరక్షణ, న్యాయ సేవల గురించి ఆయన వివరించారు. సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ కిషోర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణిత శాస్త్రంలో పీహెచ్‌డీ



మాధవి

కడప ఎడ్యుకేషన్: పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం, విద్యా విభాగం పరిశోధక విద్యార్థిని ఎస్.మాధవికి గణిత శాస్త్రంలో డాక్టరేట్ ప్రదానం చేసినట్లు డీన్ అఫ్ ఎక్సమినేషన్స్ ఆచార్య అనురాధ తెలిపారు. ఆచార్య సునీత బాయ్ గారి మార్గదర్శకత్వంలో స్ట్రెస్ అండ్ మాథెమాటిక్స్ ఆంక్సిఏటీ ఆన్ ది అచీవ్మెంట్ ఇన్ మాథెమాటిక్స్ అఫ్ సీనియర్ సెకండరీ స్టూడెంట్స్ అంశంపై మాధవి పరిశోధనా గ్రంథం సమర్పించారు. ఇందుకుగానూ ఎస్.మాధవికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వెల్లడించారు. ఎస్.మాధవికి డాక్టరేట్ రావడంతో ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

సంచార జాతుల విముక్తి దినోత్సవానికి తరలిరావాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఈ నెల 30న విజయవాడలో నిర్వహించే కడప జిల్లా సంచార, అర్ధ సంచార జాతుల విముక్తి దినోత్సవ సభకు పెద్ద ఎత్తున జిల్లా నుంచి తరలి రావాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రభు కుమార్ పిలుపునిచ్చారు. కడపలో కార్యక్రమానికి సంబంధించిన కర పత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడకు పెద్ద ఎత్తున సంచార జాతులు తరలిరావాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను సభలో వివరించడం జరుగుతుందన్నారు. ఈ సభకు పలువురు బీజేపీ నాయకులు, ఓబీసీ మోర్చా నాయకులు, సంచార, అర్ధ సంచార నాయకులు హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మావతి బాయి, కడప డీఎన్‌టీ కన్వీనర్ దొమ్మర శ్రీనివాసులు, మంజుల రామకృష్ణ పాల్గొన్నారు.

తెలుగును సంపూర్ణంగా అమలుచేయాలి



వినతిపత్రం ఇస్తున్న హనుమంతరావు

కడప కోటిరెడ్డి సర్కిల్: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో తెలుగును సంపూర్ణంగా అమలు చేయాలని తెలుగు భాషా వికాస ఉద్యమ జిల్లా అధ్యక్షుడు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్.శంషుద్దీన్‌కు ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. హనుమంతరావు మాట్లాడుతూ నామఫలకాలు, దస్తూరీలు, ఉత్తర ప్రత్యుత్తరాలు, దరఖాస్తులు అన్ని మాతృభాషలో ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మేకల వెంకటరమణ, గొడుగునూరు సురేష్‌కుమార్‌పాల్గొన్నారు.

వైవీయూలో హెల్ప్‌లైన్ కేంద్రం

కడప ఎడ్యుకేషన్: వైవీయూతోపాటూ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశం పొందే విద్యార్థుల కోసం హెల్ప్‌లైన్ సెంటర్ ప్రారంభించినట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మిప్రసాద్ తెలిపారు. ఆన్‌లైన్ అడ్మిషన్ మాడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ సైట్ లోకి వెళ్లి ప్రతి విద్యార్థి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. వైవీయూ క్యాంపస్‌లో పీజీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. సందేహాలకు వైవీయూ డీవోయే డైరెక్టర్ 9441032737 సెల్ నంబరును సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి సీపీఐ రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 24, 25వ తేదీల్లో ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చంద్ర కోరారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఒంగోలులో శుక్రవారంసాయంత్రం మూడు గంటలకు నెల్లూరు బస్టాండ్ మున్సిపల్ మైదానం నుంచి అద్దంకి బస్టాండు మార్కెట్ మైదానం వరకు భారీ ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ ఉంటాయన్నారు. ఈ సభలకు సీపీఐ జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. పాలక ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ అక్కడే రూపొందించనున్నారని తెలిపారు. మోదీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలను, సహజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి కార్మికులు, రైతులను దోపిడీ చేశారన్నారు. రాష్ట్ర పాలకులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రజా ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నాయన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక వర్గానికి ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చిన పాపాన పోలేదన్నారు. సంపద సృష్టిలో భాగస్వామ్యం అయ్యే వర్గాలన్నీ హాజరై సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, కేసీ. బాదుల్లా, కె.మునెయ్య, తదితరులు పాల్గొన్నారు.

28న విద్యుత్ అమరవీరుల ప్రతిజ్ఞ దినం



మాట్లాడుతున్న రామ్మోహన్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం మోపుతున్న విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఈ నెల 28న నిర్వహించనున్న విద్యుత్ అమరవీరుల ప్రతిజ్ఞ దినాన్ని జయప్రదం చేయాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ పిలుపునిచ్చారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2000 ఆగస్టు, 28న విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి అమర వీరులయ్యారన్నారు. వారి స్ఫూర్తితో ఈ నెల 28న కడపలో అమరవీరుల ప్రతిజ్ఞ దినం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం విద్యుత్ భారాలు మోపబోమని హామీలిచ్చి, నేడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందన్నారు. తొలి విడతలో రూ.15,474కోట్లు, రెండో విడతలో రూ.12,717 కోట్ల భారాన్ని కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిందన్నారు. విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేసి ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేసిందన్నారు. రానున్న కాలంలో ఈ భారం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, పార్టీ నాయకుడు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉసురు పోసుకుంటున్న ప్రభుత్వం



శ్రీరంజన్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు నోటీసులిచ్చి వారి ఉసురు పోసుకుంటోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన 14 నెలలకే చిన్న చిన్న కారణాలతో నాలుగు లక్షల పింఛన్లు తొలగించడం దారుణమన్నారు. రీ సర్వే పేరుతో వికలాంగులకు నోటీసులిస్తున్నారని, ఇప్పటికే కొందరికి పింఛన్లు ఆగిపోయాయన్నారు. దీంతో చాలామంది సచివాలయాలు, రిమ్స్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తమ పింఛన్లు తొలగించవద్దని వేడుకుంటున్నా ప్రభుత్వం కనికరించడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలు చెలరేగడంతో నోటీసులు ఇవ్వద్దని సీఎం ఆదేశించడం ఒట్టి డ్రామా అన్నారు. పింఛన్ అందించకపోతే వారి తరపున వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని హెచ్చరించారు.

వికలాంగులకు అన్యాయం చేయవద్దు



వెంకటేశ్వర్లు

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం వికలాంగుల పింఛన్లను రీ సర్వే చేస్తూ అర్హత నిరూపించుకోవాలంటూ నోటీసులు ఇవ్వడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సింగమాల వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1000 పింఛన్ మొత్తాన్ని పెంచి, రాష్ట్ర వాప్తంగా ఐదు లక్షల పింఛన్లను తొలగించిందన్నారు.60–70 శాతం వికలత్వం ఉన్నట్లు సదరం సర్టిఫికెట్లు ఉన్నా నోటీసులు జారీ చేయడం అన్యాయమన్నారు. ఎవరో ఒకరు తోడు లేనిదే బయటికి రాలేని వారిని ప్రభుత్వం ఇబ్బందిపెడుతోందని అన్నారు. వికలాంగుల్లో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారే అధికంగా ఉన్నారని, ఈ పింఛన్ తొలగిస్తే వారికి మూడు పూటలా భోజనం కూడా లభించదన్నారు. అలవిగాని హామీలిచ్చి ఇప్పుడు అనేక షరతులు పెట్టి సంక్షేమ పథకాల్లో కోత విధించడం సరికాదన్నారు.

బాలాలయంలో కడప రాయుని దర్శనం



బాలాలయంలో స్వామి, అమ్మవార్లు

కడప సెవెన్‌రోడ్స్ : దేవుని కడప లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బాలాలయంలో ప్రజలు స్వామి, అమ్మవార్లను దర్శించుకోవచ్చని ముఖ్య అర్చకులు మయూరం కృష్ణమోహన్ తెలిపారు. సాక్షితో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పురాతన ఆలయం కావడంతో తిరుమల–తిరుపతి దేవస్థానం జీర్ణోద్ధరణ పనులు చేపట్టిందన్నారు. స్వామి, అమ్మవార్లతోపాటు అండాళమ్మ గర్భాలయం, విమాన గోపురం, రాజగోపురాలకు మరమ్మతులు జరుగుతున్నాయన్నారు. అభివృద్ధి పనులు పూర్తయ్యేవరకు భక్తులకు దర్శన సౌలభ్యం కల్పించడానికి బాలాలయం ఏర్పాటు చేశామన్నారు. బాలాలయంలో స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి, నిత్య, నైమిత్తిక, కామ్య కైంకర్యాలు యథావిధిగా నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు అపోహలు వీడి యథావిధిగా దేవుని కడప ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకోవాలని ఆయన సూచించారు.

ఆలయ సంప్రదాయ శిల్పాల పరిశోధకురాలి పర్యటన



షర్మిలారెడ్డిని సత్కరిస్తున్న మృత్యుంజయరావు

కడప ఎడ్యుకేషన్: డిప్యూటీ కమాండెంట్ 168బీ సీఆర్పీఎఫ్ బీజాపూర్ చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల ఆలయ ఐకొనోగ్రఫీ(సంప్రదాయ శిల్పాల) పరిశోధకురాలు, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.షర్మిలారెడ్డి శుక్రవారం యోగి వేమన విశ్వవిద్యాలయంలో పర్యటించారు. లలిత కళల విభాగాన్ని సందర్శించి ఆ విభాగాధిపతి డాక్టర్ కె.మృత్యుంజయరావుతో ఆలయాల ఐకొనోగ్రఫీ, ఆలయ నిర్మాణాల గురించి చర్చించారు. చారిత్రక పరిశోధన ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం పెయింటింగ్, ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. విభాగాధిపతి డాక్టర్ కె మృత్యుంజయరావు ఈ సందర్భంగా షర్మిలారెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో చదలవాడ వెంకటేష్, చిన్నరాయుడు ఈరప్ప, వాసవి, చంటి, కె.రెడ్డిశేఖర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అమానవీయంగా వ్యవహరిస్తున్న కూటమి సర్కార్



మాట్లాడుతున్న బూసిపాటి కిశోర్

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో వృద్ధులు, దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లలో భారీ కోత పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బూసిపాటి కిశోర్ ధ్వజమెత్తారు. జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలల్లో 4.15 లక్షల పింఛన్లు తొలగించిందని, సెప్టెంబరు నుంచి 2 లక్షల దివ్యాంగ పింఛన్లు తొలగించేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు. దివ్యాంగులపై మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 2004లో డా.వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వయసు మీరి పనులు చేసుకోలేని వృద్ధులకు ప్రతినెలా సామాజిక పింఛన్లు అందించారన్నారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు వాటిని కొనసాగించాయన్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత 21 రకాల కేటగిరీలకు చెందిన దివ్యాంగులకు పింఛన్లు ఇచ్చేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. అధికారంలోకి చంద్రబాబు రాగానే దివ్యాంగులపై కక్ష సాధింపు ప్రారంభమైందని, రీ వెరిఫికేషన్ పేరుతో మెలిక పెట్టారన్నారు. పింఛన్ల పంపిణీలో సీఎం డ్రామాలకు స్వస్తి పలకాలన్నారు. ప్రతి నెలా సమావేశాల పేరుతో చంద్రబాబు చేస్తున్న ఈ వృథా ఖర్చు తగ్గిస్తే దివ్యాంగుల పింఛన్లలో కోత కోయాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ సమావేశంలో ఎస్.వెంకటేశ్వర్లు, రాయల్‌బాబు, డా.పెంచలయ్య, సుమన్ పాల్గొన్నారు.

24, 25వ తేదీల్లో రక్తదాన శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్: విశ్వ బంధుత్వ దినోత్సవం సందర్భంగా ఆంధ్ర, కర్ణాటక సబ్ జోన్ అదనపు ఇన్‌ఛార్జి సీనియర్ రాజయోగిని బీకే.గీతదీది ఆధ్వర్యంలో కడప ఓం శాంతినగర్ సేవా కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నామని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరం ఈ నెల 24, 25వ తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏర్పాటు చేశామన్నారు. శిబిరంలో రక్తదానం చేసిన వారికి ప్రభుత్వం నుంచి జారీ అయిన సర్టిఫికెట్ అందజేస్తామన్నారు.